కథ

# స్నేహ చేతన

- ఎమ్మెస్సార్ మూర్తి

**వివ.** పూర్తి పేరు వివస్వంత్. మేము డిగ్రీ చదువుకునే రోజులు. క్వాంటమ్ మెకానిక్స్ అనే పాఠ్య భాగం తనకి సరిగా అర్థంకాలేదట. నన్ను చెప్పమని అడిగాడు. నాకు తెలిసినంత వరకూ చెప్తానని వచ్చే ఆదివారం వస్తానని చెప్పాను.

ఆ ఆదివారం ఉదయమే తన రూముకి బయల్దేరాను. వివ చాలా కలుపుగోలుగా ఉంటాడు. కాలేజీలో అటు విద్యార్థులకీ ఇటు లెక్చరర్లకీ తలలో నాలుక.

ఏ లెక్చరర్ని అడిగినా కాదనరు. కానీ నన్ను చెప్పమనడంలో అంతరార్థం ఉంది. ఇదివరకెప్పుడో లాబరేటరీలో ప్రయోగం చేస్తున్నప్పుడు ఓ గంభీరమైన సూత్రాన్ని చిటికలో అర్థమయ్యేలా చెప్పాను. ఎంతో ఆనందపడిపోయాడు.

అందరిలాగే నేనూ వివ ని ఎంతో గౌరవంగా చూస్తాను.

అతని పాపులారిటీకి కారణం ఆలోచించీ, విశ్లేషించీ ఒక అభిప్రాయానికి వచ్చాను. అదేంటంటే - అతను అమ్మాయిలను ఎంతో గౌరవంగా చూస్తాడు. అమ్మాయిలు అతనితో ఎంతో మర్యాదగా అరమరికలు లేకుండా మాట్లాడుతుంటారు. వాళ్లందర్నీ ఇతను ఇదివరకే ఎరిగి ఉన్నవాడిలా ఉంటే వాళ్ళూ మర్యాదగాను ఇతనితో కలిసి మెలసి ఉన్న వారిలా ప్రవర్తిస్తారు. అలాగని ఎక్కడా ఎప్పుడూ ఎవరికీ అపార్థాలు లేవు.

***

నా కోసం ఎదురు చూస్తున్న వాడిలా రూము బాల్కనీలో ఉన్నాడు. పైకి మెట్లు ఎటువేపో చూపించాడు. క్రిందివాటాలో ఓ పాప "వివ ఉన్నాడోచ్" అంది, అతని కోసం నేను వచ్చినట్లుగా అంచనావేసి. రూములోకి అడుగెట్టగానే నాకు కనిపించిన దృశ్యం నుంచి దృష్టి మరల్చు కోలేకపోయాను. ఎదురుగా గోడకి రెండు మేకులకు హారంలాగా తగిలించిన జడకుప్పెలు.

**రూములోకి అడుగెట్టగానే నాకు కనిపించిన దృశ్యం నుంచి దృష్టి మరల్చు కోలేకపోయాను. ఎదురుగా గోడకి రెండు మేకులకు హారంలాగా తగిలించిన జడకుప్పెలు.**

అలాగే చూస్తూ ఏమిటా అది అన్న ఆలోచనలోంచి తేరుకోలేకపోయాను.

ఈలోపల వివ రెండు కప్పుల్లో టీ కలుపుకుని వచ్చాడు. అతను ఆ సింగిల్ రూములో ఉంటున్నా ఇతర సదుపాయాలున్నాయి.

స్వయం పాకం.

"భోజనాలు ఇక్కడే చేద్దామా- హోటల్‌కి వెళ్దామా?" అన్నాడు టీ ముగించి.

"చూద్దాం" అన్నాను.

అన్యమనస్కంగానే - ఆ జడకుప్పెలేవిటో ననుకుంటూ పేపర్లు చేతిలోకి తీసుకుని -

"సో... క్వాంటమ్ ... బహువచనం క్వాంటా - " అంటూ మొదలెట్టాను.

"నీ స్టైల్ లో చెప్పు" అన్నాడు.

"ఏముంది! 'కాంతి అలల రూపంలో వెళ్తుంది' అనేది ఒక సిద్ధాంతం. సినిమా కథలో హీరో హీరోయిన్లని పోల్చుకోగలం కనుక వాళ్లలాగా ప్రేమించుకుంటారని తెలుసు. అలాకాక నిజ జీవితంలో మనం కొంతమందిని చూడగానే ఏదో మనసు తేలిక పడుతుంది. మనం

**ఆ అమ్మాయి ముఖంలో ఓ వింత కళ - పెదిమలు చిరునవ్వుతో వణికాయి. వాళ్ళమ్మ ఇంకా రాలేదుకదా అన్నట్టు గుడివైపు చూసి -**

**నన్ను - వాళ్ళమ్మలాగే - ముద్దెట్టుకుంది.**

విడిపోయినా ఆ ఆలోచనా తరంగాలు - మానసికంగా, భౌతికంగా తగుల్తున్నట్లనిపిస్తుంది. కదా!"

"అర్థమైంది" అంటూ ఎంతో లోతుగా నవ్వాడు వివ.

అలాగే ఎనర్జీ ఎమిషన్ అండ్ అబ్‌సార్ప్షన్. శక్తి వేరే వస్తువుకి ఇవ్వబడుతున్నా ఆ శక్తి ఆస్వాదించబడుతున్నా అది ఓ డిస్క్రీట్ పాకెట్స్‌లలోనే జరుగుతుందట!

"అంటే ముద్దలు... ముద్దలుగా.....

మరీ సున్నితంగా చెప్పుకోవాలంటే

ముద్దులు... ముద్దులుగా....."

ఇద్దరికీ నవ్వాగింది కాదు.

శ్రోడింగర్ సమీకరణ, బోల్ట్జ్‌మన్ కానిస్టెంటూ, ఐన్‌స్టైన్ రిలెటివిటీ - మమూలు మాటల్లో చెప్పాను.

రేడియేషన్ గురించి విపులంగా మాట్లాడుకున్నాము.

"ఇక పరవాలేదు" అన్నాడు తృప్తిగా.

ఆపాటికే భోజనం చేసే వేళ అయింది.

అతనేదో అడుగుతున్నాడు.

నేను సమాధానం చెప్పలేకపోయాను.

నన్ను తట్టి - "ఏమిటీ ఎక్కడో ఆలోచిస్తున్నారూ?"

నేను ఉలిక్కిపడి - "అదే రిలెటివిటీ -

మనం ఇక్కడే ఉండి ఎక్కడో ఆలోచిస్తూ ఆ ఆలోచనల పరంపరతోనే పనిచేస్తుంటాము. అన్నట్టు నాకు ఓ ప్రామిస్ చెయ్యాలి వివా-"

"ష్యూర్"

అప్పుడడిగాను - ఆ జడకుప్పెల సంగతేమిటి అని. ఆ భగ్న ప్రేమ ఏదైనా ఉంటే కనీసం సాపేక్షంగానైనా విని బాధపడాలని ఉంది.

ఆ విషాదం మర్చిపోవడానికే అతనంతగా అందర్లో లీనమౌతున్నాడన్న 'క్లూ' దొరికింది.

"భోజనం చేసాక చెప్తాను" అన్నాడు.

"నో. మూడ్ పోతుంది" అన్నాను లాలనగా.

"కరెక్టే ఇప్పుడే చెప్తాను. ఎందుకంటే అదికూడా ఓ క్వాంటమ్ మెకానిక్స్ అని ఇప్పుడనిపిస్తోంది. టీ తీసుకుని వస్తాను అంటూ లోనికి వెళ్లాడు.

***

ఓ చిరునవ్వు.

కొన్ని వేల లైట్ ఇయర్స్ దూరంలో ఉన్న ఓ వింత రేడియేషన్ అతన్ని ఆవరించిందా అన్నట్టు మొదలెట్టాడు-

"మాది ఓ పల్లెటూరు. రైల్వేస్టేషన్‌కి వెళ్లాలంటే తొమ్మిది మైళ్ళు నడవాలి. మా ఊరికీ రైల్వే స్టేషనుకీ మధ్య మూడు గ్రామాలు. నేను ఏడవతరగతి చదువుతున్నాను. చురుకుగా ఉండేవాడ్ని. మా ఊరి మునసబుగారికి నేనంటే ఇష్టం. వాళ్ళబ్బాయి నేనూ ఒకే తరగతి. ఉదయమే నా కోసం కబురుపెట్టి - నేను వెళ్ళగానే ఓ కవరిచ్చి ఉన్నపళంగా - రహస్యంగా - ఆ కవరుని రైల్వే స్టేషన్ మాస్టారుగారికి అందజేసి రమ్మని పంపారు.

మునసబుగారికి ఎందరో నౌకర్లు. నన్నే ఎందుకెళ్లమన్నారంటే - ఆ వేకువనే ఆయన్నో పాము కాటువేసిందట. అది విషసర్పమో, కాదో తెలుసుకునే లోపల పారిపోయింది. ఆ విషయం ఇంట్లో తెలిస్తే కంగారుపడి పోతారని ఇక ఊరంతా కలగాపులగమవుతుందని- తనేదో ఫస్ట్ ఎయిడ్ చేసుకుని - పాముల నరసయ్యకి ఫోన్ చేయించడానికి పంపారు. పాముల నరసయ్య రైల్వేలో పన్జేస్తూంటారు. పాముకాటు వివరాలు తెలియగానే - ఓ మంత్రం చదివి - తన మీదున్న చొక్కాని చించి ముడివేస్తే విషం దిగిపోతుందట! నేను వెంటనే ఎవరికీ చెప్పకుండా బయలుదేరాను. ఆరోజుల్లో మాఊర్లో సైకిళ్ళు కూడా అట్టే లేవు. వేగంగా నడుస్తున్నాను.

**కళ్ళింతవి చేసుకోవడానికి పట్టు పరికిణీతో తుడుచు కుందా అన్నట్టు ఎంతో పెద్దకళ్ళు. ఇక ఆ తల్లి ఆనందంతో - "నా బంగారు తండ్రి, ఇంద తీసుకో" అంటూ ఓ కుచ్చుల సంచి తీసి చిల్లర ఏదో ఇవ్వబోయింది.**

రాజుపాలెం, వమ్మెవరం దాటాను.

ఇక ఉప్పుగుండూరు చేరాలి. మరలా ఆ ఊరి నుండి స్టేషన్ ఇంకో మైలున్నర. పొలంగట్ల మీద నడుస్తుంటే పక్క జమ్మి పొదల్లో కనిపించింది.

పొద చాలా చిన్నది. హుందాగా మెరుస్తున్నాయి.

బంగారు జడకుప్పెలు - మూడు-

జడలో వేసుకోవడానికి నల్లటి పట్టు దారాల వరసలు.

చుట్టూ చూసాను.

జడకుప్పెలను తీసి జేబులో వేసుకున్నాను. మళ్ళీ నడక.

ఉప్పుగుండూరు ఊరి ముందు చెరువు పక్కన అమ్మవారి గుడి ఉంది.

గుడి ముందర ఒకామె దిగులుగా కూర్చొని ఉంది. పక్కనో పాప తన విడివడిన జడ చివరలు చూసుకుంటూ ఏడుస్తూ ఉంది.

నాకు వెంటనే అనుమానం వచ్చింది.

"జడ కుప్పెలు - అవునా?" అన్నాను, ఎదురుగా నిలబడి. వాళ్ళిద్దరూ కళ్ళింతవి చేసుకుని చూశారు.

జేబులోంచి తీసి ఇచ్చాను. వారిద్దరి సంతోషానికి అవధుల్లేవు.

ఆ పాప సంతోషంతో వాళ్ళమ్మకాళ్ళని చుట్టివేసి పెద్దగా ఏడ్చింది.

"ఏడవకు బంగారూ- అనవసరంగా తిట్టాను. ఇక ఎప్పుడైనా నిన్ను ఓ మాటంటే ఒట్టే అంటూ పాపని పొదివి పట్టుకుంది.

ఆ పాప వయస్సు నాకంటే ఓ సంవత్సరం తక్కువ ఉండవచ్చు. వాళ్ళమ్మలాగే ఎంతో అందంగా పొడవుగా ఉంది.

కళ్ళింతవి చేసుకోవడానికి పట్టు పరికిణీతో తుడుచు కుందా అన్నట్టు ఎంతో పెద్దకళ్ళు. ఇక ఆ తల్లి ఆనందంతో - "నా బంగారు తండ్రి, ఇంద తీసుకో" అంటూ ఓ కుచ్చుల సంచి తీసి చిల్లర ఏదో ఇవ్వబోయింది.

"నాకు డబ్బే కావలనుకుంటే - అవి ఇచ్చేవాడిని కాదు కదా!" అన్నాను. వెనక్కు తగ్గుతూ -

"అవును కదా! తప్పయిపోయింది. ఇదో చెంపలు వేసుకుంటున్నాను" - అంటూ ఆ ఆనందోత్సాహంలో నన్ను పొదివిపట్టుకుని ఆ చెంపా ఈ చెంపా ముద్దెట్టుకుంది.

నేను ఉక్కిరిబిక్కిరయ్యాను.

"చల్లనితల్లి - ఈ అమ్మవారి ఒడిలో ఏడుస్తుంటే నీచేత పంపింది - అంటూ వేగంగా గుళ్ళోకి వెళ్ళింది.

నేను - నా ఎదురుగా ఆ అమ్మాయి!

ఆ అమ్మాయి ముఖంలో ఓ వింత కళ - పెదిమలు చిరునవ్వుతో వణికాయి. వాళ్ళమ్మ ఇంకా రాలేదుకదా అన్నట్టు గుడివైపు చూసి -

నన్ను - వాళ్ళమ్మలాగే - ముద్దెట్టుకుంది.

తను దూరంగా జరిగే లోపల వాళ్ళమ్మ వచ్చి మధ్య వ్రేలికి అద్దుకుని తెచ్చిన కుంకుమని నాకూ, తన కూతురికీ - ఆ తర్వాత తనకీ పెట్టుకుని - ఆప్యాయంగా నవ్వుతూ "పెళ్ళికి వెళ్తున్నాం" అంది.

నేను "వెళ్తా" నన్నాను.

వదల్లేక వదిలినట్లుగా ఆ తల్లి నా చేయి పట్టుకుని గద్గదంగా, ఆప్యాయంగా "జాగ్రత్తగా వెళ్ళిరా" అంది.

ఆ అమ్మాయిని ఓసారి చూద్దామనిపించి వెనక్కి తిరిగాను.

తనూ- పెదిమలతోనే నిశ్శబ్దంగా - నవ్వుతూ అన్నది -నాకు స్పష్టంగా వినిపించినట్టయింది- "జాగ్రత్తగా వెళ్ళిరా"-

అంతే-

నేను మునసబుగారు చెప్పినట్టుగా వెళ్ళి - స్టేషను మాస్టారి గారింట్లో అన్నంతిని - ఇంటికి వచ్చాను.

కాసేపు మౌనంగా ఉన్నాడు.

నేనూ మాట్లాడలేదు.

"ఆ దృశ్యం గుర్తు చేసుకోవడానికి ఓ సాదా జడకుప్పెలను - అలా ఉంచాను.

ఆ తల్లిదో, ఆ బంగారు తల్లి కన్న కూతురిదో- లేదా ఇద్దరిదో - వారి స్పర్శతో నాకు అంతా అర్థమై - ఇంక అర్థం చేసుకోవాల్సింది ఏమీ లేదు కదా - ఇంతేనా! అనిపించింది."

వివ ముఖంలో వింత వెలుగును చూస్తున్న నాకూ అనిపించింది.

పురాణకథలు చెప్పే మా నాన్న -

గురువులూ, మహర్షులూ తమ అనుగ్రహాన్ని చూపులతోనో స్పర్శతోనో శక్తిని అనుగ్రహిస్తారని చెప్తుంటే ఏవిటో ననుకునే వాణ్ని.

ఇప్పుడర్థమైంది - ఆ శక్తి నిపాతమేమిటో -

ఆ స్నేహ చేతన తోనే అమ్మాయిలందరూ ఇతనికి ఆకర్షితులవుతున్నారు.

ఆ చేతనా వివేకంతోనే ఇతను అందరినీ ఆహ్లాద పరుస్తున్నాడు. పెద్దగా అన్నాను - "ఇంతకీ ఈ నీ స్నేహచేతన అందరికీ వెంటనే ఎలా తెలుస్తోందీ?"

"మీరే చెప్పారుగా - క్వాంటమ్ థియరీ-

నాకు అర్థమైందేవిటంటే - అసలు - క్వాంటమ్ అనేదే .. నిజం" సూటిగా చూస్తూ అన్నాడు వివ.

"మెకానిక్సు వేరు". చప్పున నాకు తట్టింది అనేశాను.

ఇద్దరం పెద్దగా నవ్వుకున్నాం.

***

